ప్రజాశక్తి
బుధవారం 7 ఫిబ్రవరి 2024

12.5 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

ఒడిస్సా నుంచి ఘాట్ రోడ్డు మీదుగా అక్రమంగా తరలిస్తున్న 12.5 గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు సాలూరు సిఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సాకు చెందిన సాము దుర్గ ఘాట్ రోడ్డు మీదుగా సాలూరు వైపు స్కూటీపై గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో స్థానిక ఎస్సై పి.నారాయణ రావు సిబ్బందితో కలిసి సోమవారం పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద స్కూటీపై అక్రమంగా గంజాయిని తరలిస్తున్న దుర్గను తనిఖీ చేయగా 12.5 కిలోల గంజాయి లభ్యమైంది. ఈ మేరకు గంజాయి స్వాధీనం చేసుకుని స్కూటీని సీజ్ చేసి అక్రమ రవాణాకు పాల్పడిన దుర్గాపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు.

- ఏటా సాగునీటి రంగంపై నిర్లక్ష్యం
- పారిశ్రామికాభివృద్ధికీ కానరాని కేటాయింపులు
- గిరిజన యూనివర్శిటీకి నిధులు కేటాయించేనా?
- నేడు రాష్ట్రబడ్జెట్

నిధులు కేటాయించేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి అనుగుణంగా ఈ సారైనా నిధులు కేటాయించేనా? లేక ఎప్పటి మాదిరిగానే నవరత్నాలనే గొప్పగా చెప్పుకుంటారా? ఇదీ జిల్లాలో ప్రస్తుతం సాగుతున్న చర్చ. అసెంబ్లీ సమావేశాల్లో 2024-25 రాష్ట్ర బడ్జెట్ బుధవారం ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, మెడికల్ కాలేజీ, ముఖ్యంగా జిల్లాలో చేపడతామన్న పారిశ్రామికాభివృద్ధిని చాలా మంది గుర్తు చేస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 80శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇందుకోసం తలపెట్టిన తోటపల్లి, రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం ఏటా నిర్లక్ష్యం చూపుతోంది. ఈ రెండు ప్రాజెక్టులకు వందల రూ.కోట్లు కేటాయించాల్సి వుండగా నాలుగో వంతు కూడా కేటాయించలేదు. 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు తోటపల్లి ప్రాజెక్టు పనులకు రూ.294.90 కోట్లు, సిఎడిడబ్ల్యుఎం పనులకు రూ.107.69కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.107.06కోట్లు చొప్పున మొత్తం రూ.556.03కోట్లు కేటాయించాలని గత ఏడాది అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆచరణలో కేవలం రూ.80.84కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో ఖర్చు చేసింది కేవలం రూ.15కోట్లు లోపేనని సమాచారం. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో కేవలం పనుల నిమిత్తం రూ.242.17కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆచరణ ఎలా ఉంటుందో వేచిచూడాల్సివుంది. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురి చేస్తున్నాయి. పెండింగ్ పనుల వల్ల సుమారు 60వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ జలాశయం, కాలువల నిర్మాణ పనులకు మొత్తంగా రూ.535.18కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది తక్కువలో తక్కువగా 399.18కోట్లు అవసరమౌతాయని ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు ప్రాజెక్టులు తరువాత అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికీ ప్రభుత్వం అంతంతమాత్రంగానే నిధులు కేటాయిస్తోంది. మడ్డువలస, తాటిపూడి, ఆంధ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల రైతులు కూడా నీళ్ళ, నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. జెఎన్‌టియు గురజాడ వర్శిటీలో అదనపు భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు లేవు. గిరిజన వర్శిటీకి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నాయి. అసలే ఈ రెండు జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడివున్నాయి. జ్యూట్ పరిశ్రమలు దాదాపు మూతపడ్డాయి. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. వీటిని ఆదుకునేందుకుగానీ, కొత్తపరిశ్రమల స్థాపనకుగానీ ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. బాక్సైట్ శుద్ధి కర్మాగారం కోసం 18ఏళ్ల క్రితం కేటాయించిన జిందాల్ కోసం సేకరించిన భూమిలో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామంటూ ఏడాది క్రితం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్ణయించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. మరోవైపు సేవారంగంలోనే జిల్లాకు తగిన కేటాయింపులు లేవు. ఎయిర్‌పోర్టు నిర్వాసితులు ఇప్పటికీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలను చేస్తున్నారు.

కేవలం నిర్వాసితులకే సుమారు రూ.200 కోట్ల మేర రావాల్సివుందని సమాచారం. ఇలా ఒకటి కాదు... రెండు కాదు.. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నాయి. కేటాయింపులన్నీ నవరత్నాలు, జగనన్న, వైఎస్ఆర్ పేరిట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పద్దుల్లోనే కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఈ రెండు జిల్లాల అభివృద్ధి కోణంలో నేడు జరగబోతున్న బడ్జెట్ సమావేశాన్ని భేరీజు వేస్తున్నారు.

రూ.4.54వేల కోట్లతో రుణ ప్రణాళిక

ప్రజాశక్తి - పార్వతీపురం

రూ.రూ.4000.54 కోట్లుతో సంభావ్యత అనుసంధాన రుణ ప్రణాళిక (పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పిఎల్‌పి)ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) 2024-25 ఆర్థిక సంవత్సరానికి పిఎల్‌పిని తయారు చేసింది. ఈ క్రెడిట్ ప్లాన్‌ను కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ ఆధారితమైనదని, తదనుగుణంగా జిల్లాలో వ్యవసాయ, వ్యాపార, ఆహారోత్పత్తి కార్యకలాపాలకు ఆర్థికసాయం అందించి రైతులకు మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించాలని బ్యాంకులకు సూచించారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ టి.నాగార్జున క్రెడిట్ ప్లాన్ గూర్చి వివరించారు. జాతీయ ప్రాధాన్యతలు, ప్రభుత్వ విధానాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పిఎల్‌పి)ని తయారు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలు, అభివృద్ధి అవసరాల్లో మౌలిక సదుపాయాలు, అనుసంధాన మద్దతు, భౌతిక సంభావ్యత (పొటెన్షియల్) అందుబాటులో ఉన్నాయన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ తయారీలో లీడ్ బ్యాంక్, బ్యాంకర్లు, ఆదర్శ రైతులు, వివిధ శాఖల అధికారులు, సంబంధిత రంగాలకు చెందిన వ్యక్తులు, సంస్థల సహకారంతో చేశామని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, ఎంఎస్ఎంఇ, డిఆర్‌డిఎ, మెప్మా, ఇతర ప్రభుత్వ విభాగాలు, ప్రాధాన్యతా రంగ రుణాలు, అభివృద్ధిని ఇందులో అనుసంధానించినట్టు తెలిపారు. ఇందులో వ్యవసాయ రంగానికి (ఫార్మ్ క్రెడిట్) సంబంధించి పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్‌కు రూ.2709.86 కోట్లు, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్ లోన్ రూ.282.20 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.29.33 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ. 23.01 కోట్లు, క్రెడిట్ పొటెన్షియల్ ఫర్ అగ్రికల్చర్‌కు రూ.3044.41 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.378.20 కోట్లు, ఎగుమతి క్రెడిట్‌కు కోటి రూపాయలు, విద్యా రంగానికి రూ.18.54 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.245.72 కోట్లు, బ్యాంక్ క్రెడిట్‌తో కూడిన సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5.04 కోట్లు, పునరుత్పాదక ఇంధన శక్తికి రూ.2.25 కోట్లు, స్వయం సహాయక సంఘాలు/జెఎల్‌జిలు, అసంఘటిత రంగానికిరూ.305.40 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. రైతు ఉత్పత్తి సంస్థలకు రుణాలు ఇవ్వడం, పెట్టుబడి నిధి పెంపొందించడం, వ్యవసాయంలో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలని డిడిఎం కోరారు. రైతు ఉత్పాదక సంఘాలు, పశుసంవర్ధక రంగాల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకులను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాబార్డ్ క్రెడిట్ గ్యారెంటీ సౌకర్యంతో ఎపిజివిబి ద్వారా తోటపల్లికి చెందిన అన్నపూర్ణేశ్వరి ఎఫ్‌పిఒకు మంజూరైన రూ.10 లక్షల చెక్కును అందజేశారు. సమావేశంలో ఆర్‌బిఐ లీడ్ జిల్లా అధికారి పి.నాగ ప్రవీణ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, డిసిసిబి జనరల్ మేనేజర్ కె.వాసు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, ఇన్ ఛార్జ్ జిల్లా పశు సంవర్ధక అధికారి శ్రీనివాస రావు, టిపిఎంయు ఎపిడి వై సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, బ్యాంకు అధికారులు

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

సమ్మె జీవోలు విడుదల చేయాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గత 16 రోజులుగా సమ్మె చేపట్టగా, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్, సిఐటియు నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో అధికారులు ప్రకటించిన హామీలకు తక్షణమే జిఒలను విడుదల చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.శంకర్రావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌ఛార్జి డిఆర్ఒ కేశవ నాయుడుకు యూనియన్ నాయకులు, కార్మికులు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం శంకర్రావు, వెంకట రమణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వాపోయారు. సమ్మె ముగింపు రోజు జరిగిన ఒప్పందాల మేరకు జీవోలను రెండూ లేదా మూడు రోజుల్లోనే జారీ చేస్తామని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల చెల్లింపు విషయమై అధికారుల కమిటీ నివేదికను జనవరి నెలాఖరులోగా నివేదిస్తామన్నారన్నారు. అలాగే క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధమైన జీత భత్యాలు చెల్లింపు విషయమై జనవరి నెలాఖరులోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని అంగీకరించారని వాటిని పూర్తిగా మరిచారని విమర్శించారు. క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్‌కు సంబంధించి రూ.21 వేలు, శానిటేషన్ డ్రైవర్లు, విలీన గ్రామపంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21వేలు జీతం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75వేలు, దహన సంస్కారాలకు రూ.20వేలు, ఎక్స్ గ్రేషియో సాధారణ మృతికి రూ.2 లక్షలు, ప్రమాద మృతులకు రూ.5 నుంచి రూ.7లక్షలకు పెంపు, పర్మినెంట్ సిబ్బందికి సంబంధించి రూ.20 కోట్లుకు పైగా బకాయి ఉన్న సరెండర్ లీవులు చెల్లింపులు, జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభం, క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్ల్కు సంబంధించి సంక్షేమ పథకాలు అమలు తదితర జిఒలను నేటికీ జారీ చేయకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కాలయాపన విడనాడి తక్షణమే జీవోలు జారీ చేయాలని, అంగీకార ఒప్పందాల మేరకు తక్షణమే ఇంజనీరింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో పోరాటానికి సన్నద్ధం కానున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సింహాచలం, ఎం.శివ, ఎన్.మలేష్, నిర్మల, ఐ.శ్రీకాంత్, టి.జాన్, పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో మంగళ వారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలోకలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనల ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తహశీల్దార్లు తమ లాగిన్ ఐడి, పాస్ వర్డ్, డిజిటల్ కీలను అత్యంత భద్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఎటువంటి అనవసర డౌన్ లోడింగ్‌లు జరగరాదని, సమస్యలు కొనితెచ్చుకోరాదని స్పష్టం చేశారు. జిల్లాలో 1031 పోలింగ్ కేంద్రాలు, 154 సెక్టార్‌లు ఉన్నాయని చెప్పారు. ప్రతి మండలంలో 8 నుండి 12 సెక్టార్లు ఉన్నాయన్నారు. 800 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టేందుకు చర్యలు తీసుకుంతున్నామని చెప్పారు. సెక్టార్ అధికారులతో నిరంతరం సమావేశాలు నిర్వహించాలని, ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రతి అంశాన్ని తీవ్రంగానే పరిగణించాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు పరిశీలించి, కొరత ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా కార్యాచరణ ప్రణాళిక, కమ్యూనికేషన్ వ్యవస్థకు అవసరమైన ప్రణాళిక పక్కాగా రూపొందించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున అన్ లైన్ లోనే ఓటింగ్ వివరాలు నమోదు చేయాలని, నిర్దేశిత సమయంలో విధిగా జరగాలని ఆయన ఆదేశించారు. ఇవిఎంల వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేయాలని, అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు చూడాలని స్పష్టం చేశారు. ఓటరు నమోదు, తొలగింపుకు కొత్తగా దరఖాస్తులు వస్తాయని వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నుండి వచ్చిన ఆదేశాల మేరకు మాత్రమే పట్టాలు, పాస్ పుస్తకాలు, వన్ బి వంటి అంశాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఎంపిడిఒలు రక్త హీనత కార్యాచరణ బృందాల పనితీరు పర్యవేక్షించాలని, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, కుల గణన, వివిధ కార్యక్రమాల నిధుల వినియోగం, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె.హేమలత, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డిఒ సమావేశం

పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆర్‌డిఒ కె.హేమలత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్వతీపురం మున్సిపాలిటి, మండలం, సీతానగరం, బలిజిపేట మండలాల ఓటరు జాబిత వివరాలు అందించారు. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాలో మార్పు, చేర్పులను పరిశీలించి తమకు తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో తన దృష్టికి వచ్చిన సవరణల్లో చేర్పులు 90, తొలగింపులు 125, మార్పులు 181 వచ్చినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాట్లు గురించి చర్చించారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్లు కె.ఆనందరావు, వెంకట జనార్ధన్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : స్వయంసహాయసంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి మేనేజర్ సురేష్‌కుమార్

గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజన సహకార సంస్థ ఎండి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనుల్లో జీవన నైపుణ్యాల పెంపునకు, స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి గిరిజన సహకార సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవుకోనలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ దన్ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన ఇందిరాక్రాంతిపథకంతో కలిసి జిసిసి సమన్వయం చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా 415కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో జిసిసి పలు కార్యక్రమాల్లో గిరిజనులకు జీవనాధారంలో చేయూతనిస్తున్న సంగతి తెలిసిందేనన్నారు. వన్ దన్ కేంద్రాల్లోనూ జిసిసి ఇందిరా క్రాంతి పథకంతో పనిచేస్తూ వారి అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. గిరిజనుల జీవన నైపుణ్యాలు పెంపునకు జిసిసి ఇతోధికంగా తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా వారు పండించే అటవీ వ్యవసాయ ఉత్పత్తులు వేల్యూ యాడెడ్ చేసి వారికి కావాల్సిన వసతులు కల్పించేందుకు ప్రాజెక్ట్ ఆఫీసర్ల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్, వెలుగు ఎపిడి సత్యంనాయుడు, మార్కెటింగ్ మేనేజరు శేఖర్, రమనమూర్తి, ప్రవీణ, జిసిసి సిబ్బంది, ఉద్యోగులు, గిరిజనులు ఉన్నారు.

వందన్ వికాస్ కేంద్రాలు సందర్శించిన ఎండి

మక్కువ : మండలంలోని వందన్ వికాస్ కేంద్రాలను జిసిసి ఎండి సురేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. మార్కొండపుట్టిలో నటరాజ్ పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన సందర్శించారు. ఆయన గిరిజనుల నుండి పసుపు ఏ విధంగా సేకరిస్తున్నారు. గిరిజనులు పండించే గిరిజన ఉత్పత్తులను సేకరించి ప్రాసెసింగ్ చేసి గిరిజన కార్పొరేషన్ ద్వారా ఐకెపి సంయుక్తంగా సేకరించి గిరిజన ఆర్థిక అభివృద్ధి చేసేలా ముందుకు నడపాలని సూచించారు. గిరిజన కార్పొరేషన్ నుంచి ఏ విధమైన సహకారం కావాలన్నా వందన వికాస్ కేంద్రాల బలోపేతానికి జిసిసిని వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిసిసి జిల్లా మేనేజర్ మహేంద్రకుమార్, మార్కెటింగ్ మేనేజర్ వి.రమణమూర్తి, ప్రవీణ్ కుమార్, ఎపిఎం సన్నిబాబు పాల్గొన్నారు.

వంతెన పక్కకు ఒరిగిపోయిన వ్యాన్

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మగదబవలస సమీపంలో గల వంతెన వద్ద మంగళవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. స్థానికుల అందించిన వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాలకు పరీక్షా పేపర్లు తీసుకువెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి వంతెన ముందు గోడను ఢీకొట్టి వంతెనకు వైపు వ్యాను ఎక్కి ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వంతెన ఇరుగ్గా, ఇరువైపులా రక్షణ గోడల్లేకపోవడంతో ఇలా జరిగింది. వాహనాల రాకపోకలకు వీల్లేక వ్యాను తీసే వరకూ ఎక్కడివక్కడ నిలిచిపోవడంతో సుమారు మూడు గంటలు ట్రాఫిక్ జామైందని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గుర య్యారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయని, ద్విచక్ర వాహనాలతో, ఆటోలతో వెళ్లేవారు చాలా సందర్భాల్లో ఇక్కడ ప్రమాదాలు జరిగి ఈ వంతెనలో పడి ప్రాణాలు విడిచిన సంఘటన ఎన్నో ఉన్నాయని, కావున ఇప్పటికైనా సంబం ధిత అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలని వాహన చోదకులు, సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం, తాగునీటి సరఫరా మెరుగుపర్చాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలో నీటి సరఫరా వేళలను క్రమబద్ధీకరించి, పారిశుధ్యం మెరుగుపర్చాలని పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడిపి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సింహాచలంకు వినతి అందించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ వేళా పాల లేకుండా మూడు రోజులకొకసారి పట్టణంలో జరుగుతున్న నీటి సరఫరా వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని వీధుల్లో ఎప్పటిలాగే మురికి నీటి సరఫరా జరుగుతుందన్నారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా పట్టణంలో నీటి సరఫరా మెరుగుపర్చి శుద్ధమైన తాగునీటిని ప్రజలకు అందించాలని కోరారు. అలాగే పలు వార్డుల్లో పారిశుధ్య పనులు పడకేయడంతో పరిస్థితి అధ్వానంగా తయారై దుర్గంధం వెదజల్లుతుందని అన్నారు. కాలువలు శుభ్రపర్చి పారిశుధ్యం మెరుగుపరచాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ పరిస్థితుల్ని సమీక్షించి సమస్యలను చక్కదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరీ నాయుడు, కోలా సరితా మధు, టి వెంకటరావు, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు పోల సత్యనారాయణ, బోను చంద్రమౌళి, బర్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, వంగల దాలినాయుడు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య సమస్యలపై మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

ఓట్ ఫర్ ఒపిఎస్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధనకు యుటిఎఫ్ రాష్ట్ర శాఖ తలపెట్టిన ప్రత్యేక కార్యాచరణను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం సాధనకు యుటిఎఫ్ చేపట్టిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈనెల 6 నుంచి 12 వరకు పోస్టు కార్డు ఉద్యమం, అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు లేఖలు రాస్తామన్నారు. ఈనెల 13 నుంచి 29 వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరనున్నట్టు తెలిపారు. ఈ కార్యచరణలో ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.గోవిందరావు, మండల కౌన్సిల్ సభ్యులు బి.ఆదినారాయణ, బి.రమేష్, ఉపాధ్యాయులు కృష్ణ, గౌరమ్మ పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కౌలు రైతులకు రుణాలు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1200 మంది కౌలు రైతులకు ఇంకా రుణాలు అందనట్లు గుర్తించామని, వీరందరికీ రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద అర్హులందర్నీ నమోదు చేయాలని ఆదేశించారు. జగనన్న ఆసరా, చేయూత వంటి పథకాల పంపిణీ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేపడుతున్న సమయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అర్హులను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న ప్రాధాన్యతా కార్యక్రమాల్లో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని, జిల్లా అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని అన్నారు. 2023 డిసెంబరు చివరి నాటికి ప్రాధాన్యతా రంగానికి రుణ లక్ష్యం రూ.2529 కోట్లు కాగా, రూ.2350 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 93 శాతం లక్ష్యాలు సాధించారని, ప్రాధాన్యేతర రంగానికి రుణ లక్ష్యం రూ.438 కోట్లు కాగా, రూ.590 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 135 శాతం లక్ష్యాలు సాధించారని అన్నారు. కొన్ని బ్యాంకులు ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయడంలో వెనుకబడి ఉన్నాయని పేర్కొంటూ, బుధ వారం నాటికి తగు నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కాని బ్యాంకులు జిల్లాలో వ్యాపార కార్యకలాపాలు ఎందుకు చేయాలని ప్రశ్నించారు. జిల్లా ప్రజలను ఆర్థిక కార్యకలాపాలలో (ఫైనాన్షియల్ ఇంక్లూషన్) అనుసంధానం చేయడం ఆవశ్యమని, బ్యాంకులు, డిఆర్‌డిఎ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. స్వనిధి క్రింద పెండింగ్ లో ఉన్న 143 దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు.

బిజినెస్ కరస్పాండెంట్ లకు లక్ష్యాలు ఇవ్వాలి

బ్యాంకులు బిజినెస్ కరస్పాండెంట్లకు లక్ష్యాలు నిర్దేశించాలని కలెక్టర్ ఆదేశించారు. జన్ ధన్ యోజన, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, ముద్రా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర అంశాల్లో ప్రజలు నమోదుకు బిజినెస్ కరస్పాండెంట్లకు ప్రతి పది రోజులకు లక్ష్యాలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెవిఎస్ మూర్తి మాట్లాడుతూ ఆశావహ జిల్లాలో భాగంగా జన్‌ధన్ యోజన, ముద్ర, జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన తదితర అంశాలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టామన్నారు. సమావేశంలో ఆర్‌బిఐ లీడ్ జిల్లా అధికారి పి.నాగప్రవీణ్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ టి నాగార్జున, డి సి సి బి జనరల్ మేనేజర్ కె వాసు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, టి పి ఎం యు వై సత్యం నాయుడు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఎపిఇఎస్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎపిఇఎస్ఎస్‌డిసి, పార్వతీపురం ఐటిడిఎ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో మూడు ఉపాధి శిక్షణ కోర్సులకు అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు వైటిసి ఇన్చార్జ్, కేర్ టేకర్ వివి రాము తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక వైటిసి కేంద్రంగా నిరుద్యోగ గిరిజన యువతకు రిటైల్ స్టోర్ మేనేజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, నర్సింగ్ (జిడిఎ) కోర్సుల్లో రెండు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ట్రైనింగ్ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుందని, శిక్షణ అనంతరం ప్రైవేట్ సెక్టార్లో సంబంధిత రంగంలో ఉపాధి కల్పిస్తామని అన్నారు. పై మూడు కోర్సులకు వసతికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, అభ్యర్థులు తమ దరఖాస్తులను వైటిసికి నేరుగా ఇవ్వాలని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 8978878557 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చని కోరారు.

విద్యార్థి మృతిపై ఎస్‌సి కమిషనర్ చైర్మన్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట హాస్టల్‌లో ఏడో తరగతి విద్యార్థి డేవిడ్ రాజు విద్యుత్‌షాక్ తగిలి మృత్యువాత పడిన సందర్భంగా ఎస్టీ కమిషన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వెంటనే ఆ జిల్లా అధికారులను సంఘటనపై పూర్తి నివేదిక కోరింది. ఇటువంటి దుర్ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. వారం రోజుల్లో ఈ సంఘటనపై నివేదికను, తీసుకున్న చర్యలని తెలియజేయాలని కలెక్టర్‌ను కమిషన్ కోరింది. త్వరలో ఆ కుటుంబాన్ని చైర్మన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు పరామర్శించనున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బగ్గందొరవలస, తామరకండి తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ మాట్లాడుతూ గ్రామాల్లో కాలువల్లో మురుగునీరు నిల్వలేకుండా మంచినీటి కొళాయిల వద్ద ఎటువంటి అపారిశుధ్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రతి పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

పార్వతీపురం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌కె జూనియర్ కళాశాలలో పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్నా విద్యాభివృద్ధికి తోడ్పడే విద్యాసంస్థలు జిల్లాలో లేకపోవడం అన్యాయమని అన్నారు. కావున జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 12 మందితో జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షులుగా పి.రమణ, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్ ఎన్నికయ్యారు.

తలవరం పాఠశాలకు బంగారు పతకం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బంగార పతకం లభించినట్లు ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు మంగళవారం తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 4 నుంచి 6వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయిలో అండర్-17 విభాగంలో టెన్ని కోయిట్ క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన బొద్దాన రాజుకు బంగారు పతకం లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిహెచ్ మధుసూదనరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వై.ధనలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కిచ్చాడ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు

టిడిపి,జనసేనతోనే అభివృద్ధి : శత్రుచర్ల

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి జనసేన కూటమి తోనే సాధ్యమని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. మండలంలో కిచ్చాడలో మంగళవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెంది ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని, కావున రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన ఉమ్మడి పార్టీ అభ్యర్థులకు గెలిపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలోటిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్, నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు చిలకల వెంకటరావు, జనసేన నాయకులు ఎన్. వంశీ పాల్గొన్నారు.

లక్కాయి గూడలో...

సీతంపేట : మండలంలోని శిలగాం పంచాయతీ పరిధి లక్కాయిగూడలో పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో అవగాహన చేశారు. అలాగే సమావేశం లో టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సవర అక్కరాజు, సవర సిమ్మయ్య, సవర గణేష్, మహిళలు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈసారైనా ఆదరించండి : సంధ్యారాణి

ప్రజాశక్తి - మక్కువ

గతంలో రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి దెబ్బతిన్నానని ఈ సారైనా తనపై మక్కువ చూపి ఆదరించాలని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం మక్కువ జయహో బిసి కార్యక్రమం మండల నాయకులు జి.వేణుగోపాలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ బిసిలకు వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, ప్రజలకు ఇచ్చింది తక్కువ, దోచుకుతిన్నదే ఎక్కువని విమర్శించారు. జగనన్న కాలనీలో పేరుతో పేదల నుంచి ఇచ్చే భూములకు తక్కువ డబ్బులు ఇచ్చి లక్షల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని దోచుకున్నారని ఆరోపించారు. టిడిపి విజయానికి ఎవరు కలిసి వచ్చినా కలుపుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలోనూ నియోజకవర్గంలోనూ పార్టీ గెలుపే ముఖ్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు, ఎం.తిరుపతిరావు, చలుమూరు వెంకటనాయుడు, ఆమదాల పరమేశ్వరరావు, ముఖీ సూర్యనారాయణ, పలువురు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కుష్టు వ్యాధి నిర్మూలనపై తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఆరోగ్య సిబ్బంది కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అవగాహనతో ఉంటే కుష్టు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని అన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కుష్టువ్యాధి పట్ల అచ్చు వేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడికొండ పిహెచ్‌సి సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎమ్మెల్ హెచ్‌పిలు, ఆరోగ్యశాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న తాడికొండ పిహెచ్‌సి సిబ్బంది

1.76 లక్షల మంది విద్యార్థులకు డి- వార్మింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 1,75,891 మంది చిన్నారులు, విద్యార్థులకు డి-వార్మింగ్ మాత్రలు వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాధరావు తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 9న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. జిల్లాలో 84,426 మంది బాలురు, 88,465 మంది బాలికలు వెరసి 1,75,891 మంది ఉన్నారని తెలిపారు. వీరందరికీ ఉచితంగా మాత్రలు అందజేస్తామని స్పష్టం చేశారు.

ఆర్థిక సంఘం నిధులు ఖర్చయ్యేలా చూడాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈ ఏడాది విడుదలైన ఆర్థిక సంఘం నిధులు వ్యయమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి సిఇఒ కె.రాజకుమార్ ఎంపిడిఒలను కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దస్త్రాల నిర్వహణను పరిశీలించిన ఆయన ఎంపిడిఒ వెంకటరమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పార్వతీపురం డివిజన్‌కు చెందిన 11 మండలాలకు విడుదలైన రూ.4.90 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కృష్ణుడు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాధరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 9న జరగబోయే డి వార్మింగ్ (నులిపురుగుల నిర్మూలన దినోత్సవం) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం పరిధిలో అందుబాటులో ఉన్న మందులను, రికార్డులను, ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మామిడి శివ గాయత్రి, సిబ్బంది సత్యనారాయణ, నారాయణరావు, సత్యవతి, లక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిఎంఒ తనిఖీ

మండలంలోని గళావిల్లి, బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) టి.జగన్‌మోహనరావు మంగళవారం సందర్శించారు. ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేసి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివేదికల వివరాలు పరిశీలించారు. మైక్రోస్కోప్, ల్యాబ్ పరికరాల పనితీరును గమనించారు. పిహెచ్‌సిలో మందులు, వ్యాక్సిన్ నిల్వలు వాటి నిర్వహణ రికార్డులు తనిఖీ చేశారు. ప్రసూతి గదిలో డెలివరీ కోసం అవసరమైన సదుపాయాలు ఏ మేరకు నిర్వహిస్తున్నారో పరిశీలించి, పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పిహెచ్‌సిల్లో నిర్వహించిన ఆశాడే సమావేశంలో పలు ఆరోగ్య కార్యక్రమాల సమీక్ష చేశారు. ఈనెల 9న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే కార్యక్రమం కార్యచరణ సిద్ధం చేయాలన్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని, హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. పిల్లలకు శతశాతం లక్ష్యంగా సకాలంలో టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కిరణ్మయి, సూపర్‌వైజర్లు కె.కర్ణ, వెంకటరమణ, చినతల్లి, చంద్రావతి, నాని, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్ శిబిరం పరిశీలన

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలసలోని జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్ - 2) కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మంగళవారం తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యుల కౌంటర్ల వద్ద రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలను పరిశీలించి వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. రోగుల చెప్పే ఆరోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకొని తగు చికిత్స అందజేయాలని స్పష్టం చేశారు. ల్యాబ్ కౌంటర్ వద్ద రక్త పరీక్షలను, వాటి నివేదికలను పరిశీలించి హెచ్చు తగ్గులు ఉన్న వారిని పర్యవేక్షణ చేయాలన్నార్న. క్షయ, కంటి తనిఖీలను పరిశీలించారు. దీర్ఘకాలిక రోగాలు, వాటి ఆరోగ్య సూచనలు,లక్షణాలకు సంబందించి చిత్రాలతో కూడిన ఫ్లిప్ చార్ట్‌ను అక్కడ ప్రజలకు సిహెచ్ఒ వివరించే విధానాన్ని పరిశీలించారు. ఫార్మసీ వద్ద మందులను, అత్యవసర మందులను పరిశీలించారు. జెఎఎస్- 2 లో అందజేసిన వైద్య సేవలను ఆన్లైన్ చేయాలన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్ ను పరిశీలించి, ఆవశ్యకతను గర్భిణీలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.సంతోష్ కుమార్. గోపాలరావు, సర్పంచ్ చంద్రి నాయుడు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ రత్నం, డాక్టర్ సిజ్జాద తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎఎన్ఎంలు

చలో విజయవాడ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఆశా కార్యకర్తలు ఈనెల 8న తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై జరుగు చలో విజయవాడలో కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్యాధికారి పి.పావనికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పద్మ, ఆర్.లక్ష్మి, పి.లక్ష్మి, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పాచిపెంట, గురువునాయుడుపేట పిహెచ్‌సిల్లో ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు కనీస వేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సిహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా నియమించాలని కోరుతూ మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.నాగమణి, పి.నిర్మల, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు, భవానీ, నారాయణమ్మ, అనూష, మంజుల, చండీప్రియ తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : జిల్లాలోని మామిడిపల్లి, బాగువలస, తోణాం పిహెచ్‌సిల్లో మెడికల్ ఆఫీసర్లకు ఆశాలు, సిహెచ్‌డబ్ల్యూలు ఎదుర్కొంటున్న సమస్యలను వినతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, రమణమ్మ, భారతి శ్రీదేవి, ధనలక్ష్మి, త్రివేణి, ఆదిలక్ష్మి, సిహెచ్ డబ్ల్యూ సంఘ నాయకులు రమణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతానగరం : ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కొమరాడ : ఈనెల 8న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కూనేరు రామభద్రపురం పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఎల్లమ్మ, హైమా, చినతల్లి పెద్ద ఎత్తున ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై ఆశాలకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆశా డే సందర్భంగా జిల్లా హాస్పిటల్ ప్రాంగణంలో గల పిపి యూనిట్‌లో ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంపై ఆశాలకు అవగాహన కల్పించారు. అలాగే గర్భిణీలకు రక్త హీనతపైన ఫ్యామిలీ డాక్టర్ విధానంపైన ఇతర ఆరోగ్య సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. ప్రతి నెలా 9న జరిగే పిఎంఎస్ఎంఎ కార్యక్రమానికి గర్భిణీలు హాజరయ్యేలా చూడాలన్నారు. కాన్పు సమయం దగ్గరగా ఉన్న వారిని, అరుదుగా ఉన్న బ్లడ్ గ్రూప్ ఉన్నవారిని గుర్తించాలన్నారు. హైరిస్క్, రక్త హీనత గర్భిణులను ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని సూచించారు. కార్యక్రమంలో పిపి యూనిట్ వైద్యులు డాక్టర్ మన్మో, డాక్టర్ లావణ్య, హెల్త్ సూపర్ వైజర్లు జయగౌడ్, పి. పుష్ప, ఇందిర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిపించాలి

వీరఘట్టం : గర్భిణులకు పురిటినొప్పులు వచ్చినప్పుడు వారిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి అక్కడే ప్రసవాలు జరిగేలా చూడాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తరచూ గ్రామాల్లో సందర్శించి గర్భిణిలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ కళాజాతాలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజాభివృద్ధి : జెవివి

ప్రజాశక్తి - పాలకొండ

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలకు అవగాహన కల్పించి, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. శాస్త్రీయ దక్పథ కాంపైన్‌లో భాగంగా జెవివి జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరునాయుడు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సైన్స్ కళా జాతా స్థానిక వివేకానంద హై స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ సైన్స్ కళా జాతా ద్వారా ప్రజానీకాన్ని మూఢనమ్మకాల నిర్మూలన పట్ల చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పారి నాయుడు మాట్లాడుతూ సైన్స్ కళా జాతా ద్వారా ప్రజానీకాన్ని జెవివి చైతన్యవంతం చేయడాన్ని అభినందించారు. జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు బివి రమణ శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు జెవివి కృషిని కొనియాడారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సార్తి మహేశ్వరరావు సైన్స్ కళా జాతా విశిష్టతను తెలియజేస్తూ మూఢ నమ్మకాలను సమాజం నుంచి దూరం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు బిఎం గౌరీశ్వరరావు నమ్మకానికి-మూఢనమ్మకానికి మధ్య వ్యత్యాసాన్ని పాట రూపంలో వివరించారు. సమతా కన్వీనర్ శశిరేఖ శాస్త్రీయ సమాజ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సైన్స్ నృత్య రూపకాలు, సైన్స్ నాటికలు, సైన్స్ గీతాలాపన, సైన్స్ మ్యాజిక్ ప్రదర్శించారు. కార్యక్రమంలో శాస్త్రీయ దక్పథం కరపత్రాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు రామారావు, చిన్నారావు ఫకీరు స్వామి, పుష్పనాథం, రామకృష్ణ, బాబు, గణేష్, నాగేశ్వరరావు, రాజకుమారి, సతీష్, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డు హెల్త్ సెక్రటరీల సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

వార్డ్ హెల్త్ సెక్రెటరీల సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల యూనియన్ ఆధ్వర్యంలో ఎఎన్ఎంలు ధర్నా నిర్వహించి అనంతరం డిఎంహెచ్ఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ బివి రమణ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఢిల్లీశ్వరి, బి.రమ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన సాంకేతిక పరికరాల్లో తప్పుగా నమోదైన సమస్యలకు ఎఎన్ఎంలను బాధ్యులుగా చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. ఉద్యోగులు తప్పు చేయకపోయినా వారిని బాధ్యులను చేయడం సమంజసం కాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కారణాలతో సస్పెండ్ చేసిన 14 మంది సస్పెన్షన్ ఆర్డర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ సమస్యలపై ఐక్యంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణమ్మ, ప్రమీల, శ్రామిక మహిళా నాయకులు వి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని బాగువలస ఎస్సీ కాలనీలో కొంత మంది టిడిపి నాయకులు తమ వద్ద నుంచి ఆధార్, ఫోన్ నెంబర్లు తీసుకున్నారని సవరాల పైడితల్లి, కరుణమ్మ, సురేష్ కుమార్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు ఏంద్రాపు అప్పలస్వామి, మత్స అప్పలనాయుడు తమ ఇంటికి వచ్చి ఆధార్, ఫోన్ నెంబర్లు రాసుకున్నారని, ఎందుకని అడిగితే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆరు గ్యారెంటీల కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు వేయనున్నట్లు చెప్పారని తెలిపారు. దీనిపై తాము వైసిపి నాయకులను సంప్రదించగా ఆధార్, ఫోన్ నెంబర్లు ఇస్తే సైబర్ నేరాల కు పాల్పడే అవకాశం ఉందని చెప్పడంతో ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ఒటిపి వస్తుందని చెప్పారని, దీని వల్ల తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పోతాయేమోనని భయంగా వుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాయమాటలు చెప్పి తమ ఆధారాలు సేకరించిన టిడిపి నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళితులు పైడితల్లి, కరుణమ్మ, సురేష్ కుమార్ కోరారు.

పాస్టర్‌ను కలిసిన తేజోవతి

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి ఆశావహ అభ్యర్థి మోజూరు తేజోవతి మంగళవారం పట్టణంలోని పెద్ద వీధి చర్చి పాస్టర్ మరియదాసును కలిశారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్నానని, ఒకవేళ పార్టీ సీటు ఇస్తే సహకరించాలని కోరారు. అనంతరం చర్చి పాస్టర్ మరియదాసు ప్రార్థన చేసి ఆశీస్సులు అందించారు. ఆ తర్వాత పెద్ద వీధికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్పీ చింతగడ దాసును కలిశారు. టిడిపి గెలుపు కోసం మద్దతు తెలపాలని కోరారు.

ప్రజల వద్దకే ధ్రువపత్రాలు

రపజాశక్తి - కొమరాడ

ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు వారి ఇంటి వద్దకే వచ్చి అందజేస్తామని స్థానిక ప్రాథమిక వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కల్లికోటలో జగనన్న సురక్ష 2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ప్రజలకు వివిధ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పవన్, దుర్గాప్రసాద్, సర్పంచ్ దత్తి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్

పాలకొండ : పొగాకు వాడకం నియంత్రణలో భాగంగా ఎన్‌సిడి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ దవల భాస్కరరావు పర్యవేక్షణలో ఎన్టీసీపీ స్వచ్ఛంద కార్యకర్త కె.భవాని పట్టణంలోని పలు దుకా ణాల్లో దాడులు నిర్వహించారు. కొందరి నుంచి సరకులు స్వాధీనం చేసుకొని రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. నెలకు రెండుసార్లు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఆవరణలో ధూమపానం చేయడం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు. తనిఖీల్లో హెల్త్ విజిటర్ జె.రమణమ్మ, నత్తల కల్యాణ్‌ప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

స్టాపర్స్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - కురుపాం

స్టాపర్లను ఢీకొని ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలైన సంఘటన కురుపాం సమీపాన మూలిగూడ జంక్షన్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం గుమ్మిడిగూడ పంచాయతీ దండుసుర గ్రామానికి చెందిన కొండగొర్రి సూర్యనారాయణ కురుపాం వెళ్తుండగా మూలిగూడ జంక్షన్ వద్ద పోలీసు ఏర్పాటు చేసిన స్టాపర్స్ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రమైన తరలించామని ,అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకే లిప్

ప్రజాశక్తి - వీరఘట్టం

6, 7, 8 తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులకు విద్యాప్రమాణాలు మెరుగుపర్చడమే లిప్ ఉద్దేశమని ఎంఇఒ డి.గౌరునాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని సంత నర్సిపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, చినగోర ఎంపియుపిఎస్, దశమంతపురం, కేజీబీవీ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల కోసం హిందీ సబ్జెక్టు మినహా మిగిలిన ఐదు సబ్జెక్టులకు ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోనటరింగ్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రత్నాకర్‌రావు, సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, పార్వతీపురం.

వాదులు:-

O.S 171/2023 -	రెడ్డి బలరాం నాయుడు, తండ్రి అప్పలస్వామి, రావుపల్లి.
O.S 173/2023 -	సీరాపు లక్ష్మీనారాయణ, తండ్రి జగన్నాథం, రావుపల్లి
O.S 175/2023 -	గుంట్రెడ్డి శ్రీనివాసరావు తండ్రి దాలి నాయుడు, రావుపల్లి
O.S 177/2023 -	నాగలపల్లి గట్టమ్మ, భర్త అప్పలస్వామి, రావుపల్లి.
O.S 179/2023 -	మర్రాపు శ్రీరాములు నాయుడు తండ్రి తమ్మి నాయుడు, రావుపల్లి
O.S 181/2023 -	బర్ల ఎల్లయ్య తండ్రి లక్ష్మము.
O.S 187/2023 -	ముత్తా సావిత్రమ్మ, భర్త లేట్ రామ్మూర్తి
O.S 191/2023 -	బొంతాడ సత్యం నాయుడు, తండ్రి చిన్నమనాయుడు
O.S 193/2023 -	రంబ సింహాచలం, తండ్రి లేటు అప్పలనాయుడు
O.S195/2023 -	అయిక సత్యనారాయణ, తండ్రి పోలీసు
O.S 197/2023 -	గుంట్రెడ్డి హరికుమార్, తండ్రి లేటు అప్పలనాయుడు
O.S 199/2023 -	పెదరాపు శంకరరావు, తండ్రి లచ్చి శెట్టి.
O.S 201/2023 -	కరాశి సత్యనారాయణ, తండ్రి లేటు సింహాచలం
O.S 205/2023 -	రంభ పెద్ద రాయుడు, తండ్రి లేటు రామినాయుడు
O.S 211/2023 -	మర్రాపు శంకరరావు, తండ్రి అప్పలనాయుడు.

అండ్ ప్రతివాదులు:-
గుంట్రెడ్డి శ్రీనివాసరావు, తండ్రి లేటు అప్పల నాయుడు, రావుపల్లి గ్రామం, పార్వతీపురం మన్యం జిల్లా, సెల్ నంబర్:-9985886220.

పైన తెలియజేసిన మీపై ప్రామిసరీ నోట్లు ఆధారంగా దావా వేసి ఉన్నారు. సదరు దావాలో ఎన్నో పర్యాయములు కోర్టు వారు నోటీసులు ఇచ్చినప్పటికీ సదరు నోటీసులు తీసుకోనందున, కోర్టు వారు ఆదేశాల మేరకు పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కావున ప్రతివాది అయిన మీరు **15-02-2024 తేదీన ఉదయం 10:30 గంటలకు** పై కోర్టులో హాజరు కావలసిందిగా ఆదేశించడం అయింది. మీరుగాని, మీ తరపున న్యాయవాది గాని హాజరుకానిచో పరోక్షముగా తీర్పు చెప్పబడునని తెలియజేయడమయింది.

ఇట్లు
అద్దేపల్లి నారాయణరాజు
సత్యనారాయణ పాణిగ్రాహి
అద్దేపల్లి లక్ష్మీపతి రాజు
అడ్వకేట్స్ పార్వతీపురం
సెల్ నంబర్-9440250992